TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 109 | బుధవారం, ఆగస్టు 21, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

## నాన్నా.... మీ కలలు నెరవేరుస్తా



న్యూఢిల్లీ : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి సందర్భంగా ఆయనకు లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం ప్రగాఢ నివాళి అర్పించారు. మాజీ ప్రధాని బోధనలు తనకు స్ఫూర్తి అని, భారత్ కోసం ఆయన కలలను తాను నెరవేరుస్తానని రాహుల్ తెలిపారు. ఢిల్లీలోని వీర్ భూమిలోని తన తండ్రి సమాధి వద్ద రాహుల్ పుష్పాంజలి ఘటించారు. 'దయార్ద్ర హృదయుడు, సామరస్యానికి, సుహృద్భావానికి ప్రతీక & నాన్నా ! మీ బోధనలు నాకు స్ఫూర్తి, భారత్ కోసం మీ కలలు నావే, నా వెంట మీ జ్ఞాపకాలతో వాటిని నెరవేరుస్తా' అని రాహుల్ గాంధీ 'ఎక్స్'లో హిందీ పోస్ట్‌లో పేర్కొన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఘనంగా నివాళులు అర్పించింది. 'రాజీవ్ కోట్లాది మంది భారతీయుల్లో ఆశలు రేకెత్తించి, తన 'కనివిని ఎరుగని కృషి'తో భారత్‌ను 21వ శతాబ్దికి తెచ్చారు' అని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు.

## సచివాలయంలో...
# తెలంగాణ తల్లి విగ్రహం
## : సీఎం రేవంత్



హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థల పరిశీలన చేశారు. సచివాలయం ఆవరణలో భవన ప్రధాన ద్వారం ముందు భాగంలో విగ్రహ ఏర్పాటుకు అనువైన ప్రదేశంగా భావించారు. అందులో భాగంగానే సచివాలయ ఆవరణలో ముఖ్యమంత్రి... సలహాదారు నరేంద్రరెడ్డి, ఎంపీ కిరణ్ కుమార్ చామలతో కలిసి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. అనంతరం విగ్రహ ప్రతిపాదిత స్థలం, సుందరీకరణకు తగిన డిజైన్‌పై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 9న సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తామని రేవంత్ ప్రకటించారు. తెలంగాణ స్ఫూర్తిని కాపాడటంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని, నైతికతను ఎవరూ శంకించాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా సీఎం అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు రాష్ట్ర అధికార కేంద్రమైన సెక్రటేరియట్ సముచితమైన స్థానమని, అక్కడే తెలంగాణ తల్లిని సగర్వంగా, సగౌరవంగా ప్రతిష్ఠిస్తామని సీఎం స్పష్టం చేశారు. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అందులో భాగంగా సచివాలయ ఆవరణలో స్థల అన్వేషణను ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తో కలిసి స్వయంగా తిరిగి పరిశీలించారు. ఆ తర్వాత విగ్రహ ఏర్పాటుకు ప్రతిపాదిత స్థలం, ఆ ప్రాంతాన్ని తీర్చిదిద్దడానికి అనుగుణమైన డిజైన్ కూర్పుపై అధికారులతో చర్చించారు. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని, అందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## రాజీవ్ సూచనలతోనే హైదరాబాద్‌లో...
# ఐటి రంగానికి పునాది

హైదరాబాద్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సూచనలతోనే హైదరాబాద్‌లో ఐటి రంగానికి పునాది పడిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. దేశ ప్రగతికి రాజీవ్ గాంధీ ఎంతో కృషి చేశారని, దేశంలో టెక్నాలజీని రాజీవ్ విస్తృతం చేశారని కొనియాడారు. సోమాజిగూడలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సిఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ ఇంఛార్జీ దీపాదాస్ మున్షీ, విహెచ్, మేయర్ విజయలక్ష్మి, జగ్గా రెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ ఐటి రంగానికి రాజీవ్ పునాదాలు వేశారన్నారు. రాజీవ్ కృషితో మాదాపూర్‌లో ఐటి రంగం అభివృద్ధి చెందిందన్నారు. డ్రింకింగ్ వాటర్ మిషన్ టెక్నాలజీని రాజీవ్ గాంధీ తీసుకొచ్చారని, హైడ్రా ద్వారా హైదరాబాద్‌లో



ఆక్రమణలు తొలగిస్తామన్నారు. పదేళ్లలో లక్ష రుణమాఫీ కూడా బిఆర్ఎస్ చేయలేదని, రైతు రుణమాఫీపై బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భట్టి దుయ్యబట్టారు. ఎనిమిది నెలల్లోనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి చూపించామని, ధరణిపై అసెంబ్లీలో విస్తృతంగా చర్చించామని, గతంలో కాంగ్రెస్ పేదలకు భూములు పంచిందని భట్టి గుర్తు చేశారు.

## నిరుపేదల జీవితాల్లో మార్పు తేవడమే తమ ప్రభుత్వ లక్ష్యం
# బ్రాక్ ప్రతినిధులతో మంత్రి సీతక్క వెల్లడి

హైదరాబాద్: నిరుపేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలు అమలు చేస్తోందని అన్నారు. అయితే ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా అనుకున్న స్థాయిలో అభివృద్ధి ఫలాలు పేదలకు చేరటం లేదని అన్నారు. పలు దేశాల్లో గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం పని చేస్తున్న అంతర్జాతీయ సంస్థ బ్రాక్ ప్రతినిధులతో సచివాలయంలో మంగళవారం సమావేశమైన మంత్రి సీతక్క మాట్లాడుతూ మారు మూల ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి కల్పన వంటి రంగాల్లో పనిచేస్తున్న బ్రాక్, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిందని అన్నారు. తెలంగాణ మారుమూల ప్రాంతాల్లో ప్రజల స్థితిగతులను, అమలవుతున్న సంక్షేమ పథకాల తీరును క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన బ్రాక్ ఈ సమావేశంలో ఆ వివరాలను మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మారిన పరిస్థితులు అవసరాల నేపథ్యంలో పేదలు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారని అన్నారు. పేదరికం నుంచి వచ్చిన



నాకు పేదలతో పేగు బంధం ఉందని అన్నారు. సమాజంలో ఇంకా అసమానతలు కొనసాగుతున్నాయని తెలిపారు. నిరుపేదలకు అట్టడుగు, వర్గ ప్రజలకు కనీస వసతులు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బహు రూపాల్లో పేదరికం ఇంకా కొనసాగటం బాధాకరమని అన్నారు. పేదరికన్ని రూపుమాపే దిశలో అంతా కలిసి పని చేయాలని కోరారు. అందరం అంకితభావంతో పని చేస్తే పేదరికం అనేది ఉండదని పేర్కొన్నారు.

## పని చేసే చోట డాక్టర్లకే...
# భద్రత లేకపోతే ఎలా?

న్యూఢిల్లీ: ఆసుపత్రులలో డాక్టర్లకు భద్రత లేకపోవడం పట్ల సుప్రీంకోర్టు మంగళవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. క్షేత్ర స్థాయిలో వాస్తవ మార్పుల కోసం ఒక అత్యాచారమో లేక హత్యో జరగడం కోసం దేశం వచేచి చూడలేదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జి కర్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో సంభవించిన ఒక పోస్టు గ్రాడ్యుయేట్ ట్రెయినీ డాక్టర్ హత్యాచార ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. దేశవ్యాప్తంగా ఆసుపత్రులలో పనిచేసే డాక్టర్ల భద్రతకు సంబంధించి వ్యవస్థాపరంగా ఎదువుతున్న సమస్యలను ఈ ఘటన లేవనెత్తిందని చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది.డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వైద్య సంఘాలు పదే పదే ప్రస్తావిస్తున్నప్పటికీ వైద్యులు తమ విధి నిర్వహణలో అనేక రూపాలలో హింసను ఎదుర్కొంటున్నారని ధర్మాసనం తెలిపింది. ఇతరులకు వైద్యసేవలను అందచేసే డాక్టర్లకు భద్రత కల్పించడంలో ఎటువంటి రాజీ ఉండకూడదని రాజ్యాంగంలోని అందరికీ సమాన హక్కులు అన్న సూత్రం స్పష్టం చేస్తోందని ధర్మాసనం పేర్కొంది. ఆసుపత్రులు, ఇతర వైద్య సంస్థలు అన్నివేళలా పనిచేస్తుంటాయని, ఎవరైనా, ఎక్కడికైనా ప్రవేశించడంపై ఎటువంటి ఆంక్షలు లేకపోవడంతో ఆరోగ్య సేవకులు సులభంగా హింసకు గురవుతున్నారని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రతికూల ఫలితాలు ఎదురైతే రోగుల బంధువులు డాక్టర్ల నిర్లక్షమంటూ నింద వేసేస్తుంటారని, ఈ ఆరోపణల పర్యవసానం డాక్టర్లపై




దాడిగా మారుతోందని ధర్మాసనం పేర్కొంది. వైద్యులపై దాడులకు సంబంధించి అనేక సంఘటనలను ధర్మాసనం ప్రస్తావిస్తూ ఆసుపత్రులలో విధులను నిర్వహించే డాక్టర్లు, నర్సులు, అనుబంధ వైద్య సిబ్బందికి భద్రతను కల్పించడంలో స్వవస్థీకృత వైఫల్యాలు ఉన్నాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భద్రత కోసం ఎటువంటి వ్యవస్థ లేకపోవడంతో డాక్టర్లు హింసకు సులభంగా లక్షంగా మారుతున్నారని సుప్రీంకోర్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా ఆరోగ్య సేవకుల భద్రతకు సంబంధించిన వ్యవస్థీకృత లోపాలు ఉన్న కారణంగానే తాము ఈ విషయంలో జోక్యం చేసుకోవలసి వస్తోందని ధర్మాసనం తెలిపింది.

## కాంగోకు వచ్చే వారం తొలి విడత...
# ఎంపాక్స్ వ్యాక్సిన్లు



కిన్షాసా (కాంగో) : కాంగో అమెరికా నుంచి వచ్చే వారం తొలి విడత ఎంపాక్స్ వ్యాక్సిన్లు అందుకుంటుందని కాంగో ఆరోగ్య శాఖ మంత్రి రోజర్ కంబా వెల్లడించారు. ఆఫ్రికాలో ఎంపాక్స్ కేసుల వ్యాప్తిని ప్రపంచ ఎమర్జన్సీగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లుహెచ్ఒ హు) ప్రకటించిన కొన్ని రోజుల తరువాత కాంగో వాటిని అందుకోనున్నది. డజనుకు పైగా ఆఫ్రికన్ దేశాల్లో పిల్లలు, వయోజనుల్లో ఎంపాక్స్ కేసుల ధ్రువీకరణ జరిగింది. వైరస్ కొత్త రకం వ్యాపిస్తోంది. ఆ ఖండంలో కొన్ని డోసుల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. కాంగోలో అధిక సంఖ్యలో ఎంపాక్స్ కేసులు ఉన్నాయి. ప్రస్తుతం దేశానికి 30 లక్షల వ్యాక్సిన్ డోసులు అవసరం. వ్యాక్సిన్లు దానంచేసేందుకు అమెరికా, జపాన్ సంసిద్ధత చూపాయని రోజర్ కంబా విలేకరులతో చెప్పారు. ఎన్ని డోసులు పంపిస్తారో, జపాన్ నుంచి ఎప్పుడు వస్తాయో ఆయన చెప్పలేదు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 17 వేలకుపైగా ఎంపాక్స్ కేసులు, 500 పైగా మరణాలు ఉన్నట్లు డబ్లుహెచ్ఒ తెలిపింది. అన్ని కేసులు, మరణాల్లో 96 శాతంపైగా కాంగోలోనే నమోదయ్యాయి.

## బిఆర్ఎస్, కాంగ్రెస్ ల లొల్లి అందుకోసమే

కరీంనగర్ : రైతు రుణమాఫీ, ఆరు గ్యారంటీ స్కీమ్‌ల హామీలపై చర్చను మళ్లించడానికే కాంగ్రెస్,బీఆర్ఎస్ విగ్రహాల లొల్లి ముందుకు తీసుకు వచ్చాయని కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి బండిసంజయ్ ఆరోపించారు. కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రజల దృష్టి మళ్లించడానికే కాంగ్రెస్, బిఆర్ఎస్ సవాళ్లకు ప్రతి సవాళ్లు చేసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో అర్హులకు సరిగ్గా రుణమాఫీ లేక రైతులు సతమతం అవుతున్నారని.. 6 గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ రైతు రుణమాఫీ బోగస్ అని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు చేశారు.

## ఢిల్లీ ఆస్పత్రులకు బాంబు బెదిరింపు



న్యూఢిల్లీ : ఢిల్లీలోని ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్ తదితర 50 ప్రభుత్వ ,ప్రైవేట్ ఆస్పత్రులతోపాటు ఒక మాల్‌కు మంగళవారం ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. నన్‌గ్లోయిలోని ఆస్పత్రి నుంచి మధ్యాహ్నం 1.04 గంటలకు, చాణక్యపురి లోని ప్రైమస్ ఆస్పత్రి నుంచి మధ్యాహ్నం 1.07 గంటలకు తమకు సమాచారం అందిందని ఢిల్లీ ఫైర్‌సర్వీస్ అధికారి చెప్పారు. అగ్నిమాపక వాహనాలు, బాంబు తనిఖీ బృందాలు, పోలీస్‌లు ఆయా ప్రాంతాలకు వెళ్లి తనిఖీ చేపట్టారని అయితే ఇంతవరకు ఎలాంటి అనుమానాస్పదమైనవి కనిపించలేదని అధికారులు చెప్పారు. మిగతా ఆస్పత్రుల్లో కూడా తనిఖీలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. బాంబు బెదిరింపు కాల్స్ అందుకున్న వాటిలో అపోలో, మూల్‌చంద్, మాక్స్ అండ్ సర్‌గంగారామ్ ఆస్పత్రి కూడా ఉన్నాయి. మధ్యాహ్నం 12.04 గంటలకు అందిన జిమెయిల్‌లో "మీ భవనం లోపల అనేక పేలుడు పదార్థాలను అమర్చాం. నల్లని కవర్లలో అవి ఉన్నాయి. కొన్ని గంటల్లో అవి పేలబోతున్నాయి" అని హెచ్చరించి ఉంది. "మీరు రక్తపు మడుగులో అంతం కానున్నారు. మీలో ఏ ఒక్కరూ మిగలరు. భవనం లోని ప్రతివ్యక్తి ప్రాణాలు కోల్పోతారు.

## కర్నాటక ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర



బెంగళూరు: కర్నాటక గవర్నర్ తావవర్‌చంద్ గెహ్లోట్‌ను ఉపయోగించి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి ప్రధాని నరేంద్ర మోడీ, హెూం మంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ కేంద్ర మంత్రి మార్గరెట్ ఆల్వా ఆరోపించారు. భారత ప్రజలు తమ అధికారానికి కత్తెర వేసిన తర్వాత కూడా గుణపాఠం నేర్చుకోని గుజరాతీ ద్వయం మళ్లీ తమ ఆటలు మొదలు పెట్టారని మంగళవారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఆమె వారి పేర్లను ప్రస్తావించకుండా ఆరోపించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై అవినీతి నిరోధక చట్టంలోని 17ఎ సెక్షన్ కింద, భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని సెక్షన్ 218 కింద దర్యాప్తు చేసేందుకు అనుమతినిస్తూ ఆగస్టు 16న గవర్నర్ జారీచేసిన ఉత్తర్వులపై ఆల్వా మండిపడ్డారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న ప్రభుత్వాలను అస్థిరపరచడమే పనిగా పెట్టుకున్న వారు ఇప్పుడు కర్నాటకపైన, ప్రజాదరణ కలిగిన వెనుకబడిన తరగతులకు చెందిన ముఖ్యమంత్రిపైన కన్నేశారని, తమ కుట్రను అమలుచేసేందుకు రాజ్‌భవన్‌లోని తమ సేవకుడిని ఉపయోగించుకుంటున్నారని ఆల్వా ఆరోపించారు. అయితే రాష్ట్రంలోని కాగ్రెస్ పార్టీ, దాని నాయకత్వం చాలా బలమైనదని, దాన్ని కదిలించడం వారికి సాధ్యం కాదని ఆమె చెప్పారు. 1978లో అప్పటి మొరార్జీదేశాయ్ ప్రభుత్వం కర్నాటకలోని దేవరాజ్ అర్స్ ప్రభుత్వన్నా రద్దు చేసి గవర్నర్ కుట్ర ద్వారా అసెంబ్లీని రద్దు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు.

# గాయాలు చేసి అఘాయిత్యం



కోల్‌కతా : వైద్యురాలి శరీరంపై 14 చోట్ల గాయాలున్నాయని శవ పరీక్షలో గుర్తించినట్టు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. బలవంతంగా లైంగిక చర్య జరిగిన ఆనవాళ్లు ఉన్నాయని, దీని కారణంగా ఆమె వ్యక్తిగత అవయవాల వద్ద లోతైన గాయం జరిగినట్టు ఆ నివేదికలో ఉంది. ఊపిరితిత్తుల్లో ఎక్కువ మొత్తం రక్తస్రావం జరిగినట్టు పోస్ట్‌మార్టమ్‌లో గుర్తించారు. సంఘటన సమయంలో నిందితునితో విపరీతంగా ఆమె పోరాడి ఉంటుందని నివేదికలో పేర్కొన్నారు. నిందితుడు సంజయ్ రాయ్‌కి వైద్య పరీక్షలు నిర్వహించినప్పుడు అతడి శరీరంపై గోళ్లతో రక్కిన గుర్తులు కన్పించాయని, బాధితురాలి మృతదేహాన్ని పరిశీలించగా, ఆమె గోళ్ల లోని చర్మం, రక్త నమూనాలు నిందితుడి నమూనాలతో సరిపోలినట్టు తెలుస్తోందని అధికార వర్గాలు వెల్లడించినట్టు మీడియా కథనాలు పేర్కొన్నాయి. గొంతు నులిమి ఊపిరాడకుండా చేయడం వల్లనే ఆమె మృతి చెందినట్టు పోస్ట్‌మార్టమ్ నివేదికలో పేర్కొన్నారు. బాధితురాలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో నిందితుడు ఈ దాడికి పాల్పడి ఉ ంటాడని నివేదికలో వెల్లడించినట్టు తెలుస్తోంది.

**అక్రమాలపై నిలదీసినందుకే హత్యాచారం?**

స్థానిక ఆర్‌జి కార్ ఆసుపత్రి అక్రమ మందుల వ్యాపారం, బదిలీల లంచాల చివరికి అవయవాల అమ్మకాల కేంద్రంగా ఉన్నట్లు వెల్లడైంది. లేడీడాక్టర్ హత్యాచారానికి ఇక్కడి అక్రమాలకు లింక్ ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ డాక్టరు తరచూ ఈ అక్రమాలపై తరచూ వివిధ వేదికల ద్వారా ప్రశ్నించారు. దీనితోనే కొన్ని శక్తులు ఆమెపై కక్షతో ఈ విధంగా డ్యూటీలో ఉన్నప్పుడు చిత్రవధకు గురి చేసినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని వెల్లడించారు. ఇక్కడ కోట్లాది రూపాయల విలువ చేసే అక్రమ లావాదేవీలు సాగినట్లు గుర్తించారు. భారీ స్థాయి కుంభకోణంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారుల హస్తం కూడా ఉందని కనుగొన్నారు.

**వైద్యురాలి మృతదేహాన్ని మొదట చూసిన సాక్షి వివరణ**

వైద్యురాలి మృతదేహాన్ని మొదటిసారి చూసిన ఓ సాక్షి మీడియాతో మాట్లాడారు. " సెమినార్ హాల్ లోని పోడియం వద్ద ఆమె విగతజీవిగా కన్పించింది. ఒంటిపై కుర్తా చిందరవందరగా చిరిగిపోయింది. ట్రౌజర్స్ కన్పించలేదు. మెడ నుంచి మోకాలివరకు నీలం రంగు బెడ్‌షీట్ కప్పి ఉంది. ఆమె ల్యాప్‌టాప్, నోట్‌బుక్, సెల్‌ఫోన్, వాటర్‌బాటిల్ పక్కనే ఉన్నాయి" అని ఆ సాక్షి ఓ జాతీయ మీడియాకు వివరించారు. సెమినార్ హాలులో విశ్రాంతి తీసుకునేందుకు వచ్చిన ఆమె ఒంటరిగా ఉందని గ్రహించిన నిందితుడు ఈ దారుణానికి పాల్పడ్డాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హత్యాచార సంఘటనకు గురైన 31 ఏళ్ల ట్రయినీ డాక్టర్ తండ్రి మరికొన్ని వివరాలు వెలుగు లోకి తెచ్చారు. తమ కుమార్తె డైరీలో ఓ పేజీ చిరిగి ఉందని చెప్పారు. "ఆమె బ్యాగులో ఎప్పుడూ పర్సనల్ డైరీ ఉంటుంది. దాన్ని మేం ఎప్పుడూ చదవం. ఆస్పత్రి నుంచి వచ్చాక రోజూ మాతో అన్ని విషయాలు మాట్లాడుతుంది. అయితే సంఘటన తరువాత తన డైరీని చూస్తే అందులో ఓ పేజీ కొంత చిరిగి ఉంది. దానికి సంబంధించిన ఫోటో నావద్ద ఉంది"అని హతురాలి తండ్రి ఓ మీడియాకు వెల్లడించారు. ఆ పేజీలో ఏమున్నదో చెప్పడానికి ఆయన అంగీకరించలేదు. ఈ విషయాలను బయటకు వెల్లడించవద్దని సంయమనం పాటించాలని సిబిఐ సూచించినట్టు ఆయన వివరించారు.

## కల్లు తాగిన కోతిలా కెటిఆర్ మాట్లాడుతున్నారు: జగ్గారెడ్డి



హైదరాబాద్: దేశం కోసం దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ప్రాణ త్యాగం చేశారని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహం పెడితే బిఆర్ఎస్ నేత కెటిఆర్‌కు అక్కసు ఎందుకు అని ప్రశ్నించారు. కెటిఆర్‌కు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పొలిటికల్ ట్రైనింగ్ ఇప్పిస్తే బాగుంటుందని చురకలంటించారు. గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. రాజీవ్ గాంధీ భారత దేశానికి టెక్నాలజీ తీసుకొచ్చారని, ఆయన తెచ్చిన టెక్నాలజీతోనే కెటిఆర్ చదువుకున్నారని, ఇప్పుడు కల్లు తాగిన కోతిలా కెటిఆర్ మాట్లాడటం హాస్యస్పదంగా ఉందని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ చరిత్ర అసలు కెటిఆర్‌కు తెలియదని, రాజీవ్ గాంధీ మిలిటెంట్ల చేతిలో అన్యాయంగా ప్రాణాలు కోల్పోయారని, చెరపలేని చరిత్ర వాళ్లదని మండిపడ్డారు. అధికారం కోల్పోయిన బాధలో కెటిఆర్ ఏదో ఒకటి మాట్లాడుతున్నాడని జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం కట్టారని, కెటిఆర్‌కు కలుగుతున్న బాధేంటో తమకు అర్థం కావడం లేదన్నారు.

## మహారాష్ట్రలో ఎంవిఎతో పొత్తుకు సిద్ధం



**ఛత్రపతి సంభాజీనగర్:** రానున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి(ఎంవిఎ)తో కలసి పోటీ చేయాలని భావిస్తున్నట్లు ఎఐఎంఐఎం మాజీ ఎంపి ఇంతియాజ్ జలీల్ వెల్లడించారు. రాష్ట్రంలో శివసేన(షిండే), ఎన్‌సిపి(అజిత్ పవార్)తో కలసి అధికారాన్ని పంచుకున్న బిజెపిని ఓడించడమే తమ పార్టీ లక్ష్యమని ఆయన ప్రకటించారు. ఎంఐఎం మహారాష్ట్ర విభాగ అధ్యక్షుడైన జలీల్ ముంబైలో పార్టీ సమావేశం అనంతరం మరాఠీ న్యూస్ చానల్ ఎబిపి మఝాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కూడా తాము ఎంవిఎకి ఈ ప్రతిపాదన చేశామని, బిజెపిని ఓడించడానికి తమతో చేతులు కలపవలసిందిగా మరోసారి వారికి విజ్ఞప్తి చేస్తున్నామని జలీల్ తెలిపారు. తమను కూటమిలో చేర్చుకోవడం అన్నంది ఇక వారి ఇష్టానికే వదిలివేస్తున్నట్లు ఆయన తెలిపారు. తమను కలుపుకుని ముందుకు వెళితే అది వారికే(ఎంవిఎ) లాభమని, కాని పక్షంలో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని ఆయన అన్నారు. తమకు కూడా కొంత బలం ఉందని, ఓటు బ్యాంకు ఉందని భావిస్తే తమతో చేతులు కలపడానికి వారు(ఎంవిఎ) సంసిద్ధత తెలియచేస్తారని, లేకపోతే దూరం పెడతారని జలీల్ వ్యాఖ్యానించారు. ఎంఐఎం పట్ల ఎంవిఎ భాగస్వామ్య పక్షమైన శివసేన(యుబిటి)కు ఎటువంటి అభ్యంతరం ఉండదా అన్న ప్రశ్నకు బిజెపి ఇప్పటికే దేశాన్ని నాశనం చేసిందని, ఆ పార్టీని ప్రభుత్వం నుంచి దూరం చేయాలన్నదే తమ లక్ష్యమని ఆయన అన్నారు. అయితే ప్రకాష్ అంబేద్కర్ సారథ్యంలోని వంచిత్ బహుజన్ అఘాడి(విబిఎ)తో పొత్తుకు ఆయన విముఖత వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. కొద్ది నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికలలో మహారాష్ట్రలోని మొత్తం 48 లోక్‌సభ స్థానాలలో 31 సీట్లను ఎంవిఎ గెలుచుకుంది. అధికార మహాయుతి కూటమి కేవలం 17 స్థానాలను గెలుచుకుంది.

# త్రివర్ణ పతాకాన్ని ఖద్దరుతోనే నేయాలి

న్యూఢిల్లీ : యంత్రంతో తయారు చేసిన పోలియెస్టర్ జెండాలను మోడీ ప్రభుత్వం ఆదరించడాన్ని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ మంగళవారం తీవ్రంగా ఆక్షేపించారు. త్రివర్ణ పతాకానికి విలక్షణతను చేకూర్చే వస్త్రంగా ఖద్దరును పునరుద్ధరించాలని సోనియా పిలుపు ఇచ్చారు. ఖద్దరు జాతీయ గౌరవానికి ప్రతీక కావాలని ఆమె ఉద్ఘాటించారు. సోనియా గాంధీ ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో వ్యాసం రాస్తూ, 'స్వాతంత్ర్య దినోత్సవానికి వారం ముందు 'హర్ ఘర్ తిరంగ' ప్రచారోద్యమానికి ప్రధాని నరేంద్ర మోడీ తిరిగి పిలుపు ఇవ్వడం జాతీయ పతాకంపైన, దేశానికి దాని ప్రాముఖ్యం గురించి సమష్టిగా పునరాలోకనానికి అవకాశం ఇస్తున్నదని పేర్కొన్నారు. 'ఆయన (మోడీ) ద్వంద్వ వైఖరితో ఒక వైపు జాతీయ పతాకానికి గౌరవం ఇస్తూనే, మరొకవైపు విరుద్ధ భావాలు గల సంస్థకు విధేయుడుగా ఒక ఎత్తు. చైనా, తదితర ప్రదేశాల నుంచి తరచు దిగుమతి చేసుకునే ముడి సరకుతలో యంత్రం తయారీ పోలియెస్టర్ జెండాలను ఆమోదించడం మరొక ఎత్తు' అని ఆమె అన్నారు. జాతీయ పతాకాన్ని 'చేతితో వడికిన, చేతితో నేసిన ఉన్ని/ నూలు/ పట్టు ఖద్దరు వస్త్రం'తో రూపొందించాలని భారత పతాక నియమావళి చారిత్రకంగా కోరుతున్నదని సోనియా గుర్తు చేశారు. జాతీయోద్యమానికి తన సారథ్యంలో మహాత్మా గాంధీ స్వయంగా వడికిన, నేసిన ముతకదైనా, గట్టిదైన ఖద్దరు మన చారిత్రక, సాంస్కృతిక జ్ఞాపకాల్లో ప్రత్యేకత సంతరించుకున్నదని ఆమె పేర్కొన్నారు. ఖద్దరు మన గతానికి చిహ్నం అని, భారత ఆధునిక, ఆర్థిక పటిష్ఠతకు ప్రతీక అని సోనియా అన్నారు. '2022లో మన స్వాతంత్ర్యం 75వ వార్షికోత్సవం శుభ సందర్భంగా ప్రభుత్వం 'యంత్రం తయారీ పోలియెస్టర్ వస్త్రం, తోరణం'ను చేర్చేందుకు (2021 డిసెంబర్ 30 నాటి తన ఉత్తర్వు ద్వారా) పతాక నియమావళిని సవరించింది, అదే సమయంలో పోలియెస్టర్ జెండాలను జిఎస్‌టి నుంచి మినహాయించింది. ఆ విధంగా వాటికి ఖద్దరు పతాకాలకు వలె సమాన పన్ను స్థాయి తెచ్చింది' అని సోనియా తెలిపారు. మన దేశ జాతీయ ప్రతీకల సర్వీసుకు మనల్ని నిబద్ధులను చేయడం సముచితంగా ఉండవలసిన సమయంలో ప్రభుత్వం వాటిని పక్కకు నెట్టి భారీ మార్కెట్, యంత్రం తయారీ పోలియెస్టర్ వస్త్రం వినియోగించేలా చేసిందని సోనియా విమర్శించారు. భారత ప్రమాణాల మండలి (బిఐఎస్) గుర్తింపు ఉన్న దేశంలోని ఏకైక జాతీయ పతాక తయారీ సంస్థ కర్నాటక ఖాదీ గ్రామోద్యోగ సంయుక్త సంఘ (కెకెజిఎస్ఎస్) భారత ఖద్దరు పరిశ్రమను ప్రభుత్వ ప్రాయోజిత హననం చేయడంపై జనం దృష్టిని ఆకర్షించడానికి నిరవధిక సమ్మెకు దిగవలసి వచ్చిందని ఆమె తెలియజేశారు. పోలియెస్టర్ తయారీకి గ్లోబల్ హబ్‌గా ఉన్న ఘనమైన రోజులకు భిన్నంగా భారత్ 2023, 2024లో పోలియెస్టర్ నూలు నెట్ దిగుమతిదారుగా మారిన సమంలో ఈ నిర్ణయం చోటు చేసుకుందని ఆమె పేర్కొన్నారు. 'చైనా నుంచి ప్రధానంగా పోలియెస్టర్ నూలును దిగుమతి చేసుకుని, మన జాతీయ పతాకం వస్త్రం కోసం దీనిని నేసే దురదృష్టం మనకు ప్రాప్తించింది. మన సరిహద్దుల్లో చైనీస్ సాయుధ బలాల దురాక్రమణలు, ప్రధాని 'ఆత్మనిర్భర్ భారత్ ప్రచారం' పరాకాష్ఠ సమయంలో మన జాతీయ గౌరవం ఈ విధంగా దెబ్బ తిన్నది' అంటూ సోనియా కేంద్రాన్ని దుయ్యబట్టారు. 'ప్రభుత్వ లక్ష్యంలో డొల్లతనం మహాత్మా గాంధీకి అత్యంత ప్రియతమ వారసులు మన ఖద్దరు నేతలు, కార్మికులను నేరుగా దుష్ప్రభావానికి గురి చేసింది' అని ఆమె విమర్శించారు.

ఇది మన జాతీయ పతాకానికే పరిమితం కాదు, భారతకు ప్రతిష్ఠాకరమైన చేనేత, హస్తకళల సంప్రదాయాల పట్ల ఈ ప్రభుత్వ అనాసక్తతను సూచిస్తున్నదని ఆమె అన్నారు. 2014 నుంచి ప్రభుత్వం క్రమంగా బడా కార్పొరేట్ ప్రయోజనాలను, పరిమిత స్వామికీకరణను ప్రోత్సహించసాగిందని, మన చేనేత పరిశ్రమలకు ఆలవాలమైన మన దేశ సూక్ష్మ, లఘు, మధ్య తరహా సంస్థల రంగాన్ని దెబ్బ తీయసాగిందని కాంగ్రెస్ నేత ఆరోపించారు. 'పెద్ద నోట్ల రద్దు, శిక్షాత్మక జిఎస్‌టి, అనాలోచితంగా కొవిడ్ 19 లాక్‌డౌన్ వల్ల వేలాది మంది మన చేనేత కార్మికులు తమ వృత్తిని విడనాడవలసి వచ్చింది' అని సోనియా ఆరోపించారు. 'జిఎస్‌టి నుంచి చేనేతను మినహాయించాలన్నమన కార్మికుల డిమాండ్లు ప్రభుత్వం చెవికెక్కలేదు. మరొక వైపు పెరుగుతున్న వ్యయాలు, ముఖ్యంగా విద్యుత్, పత్తి నూలు ధరలు వారిని ఇక్కట్లకు గురి చేశాయి' అని సోనియా అన్నారు. అనేక విధాలుగా లోపభూయిష్టమైన, ఇటీవలే ప్రారంభించిన విశ్వకర్మ యోజన పరిధి నుంచి చేనేత కార్మికులను పూర్తిగా మినహాయించారని సోనియా ఆరోపించారు.

### జమ్మూ కాశ్మీర్‌లో తొలి విడతకు...

# నోటిఫికేషన్ జారీ

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్‌లో మూడు దశల అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి దశ కోసం ఎన్నికల కమిషన్ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. తొలి విడతలో 24 సెగ్మెంట్లలో పోలింగ్ సెప్టెంబర్ 18న జరుగుతుంది. నోటిఫికేషన్ జారీతో అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ మొదలైంది. తొలి విడతకు సంబంధించి నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ ఈ నెల 27. నామినేషన్ల పరిశీలన ఆ మరునాడు (28న) జరుగుతుంది. అభ్యర్థిత్వం ఉపసంహరణకు చివరి తేదీ 30. అవసరమైతే సెప్టెంబర్ 18న పోలింగ్ నిర్వహిస్తారు. మొదటి దశలో దక్షిణ కాశ్మీర్ లోయలోని 16 అసెంబ్లీ సెగ్మెంట్లలోను, జమ్మూ ప్రాంతంలోని ఎనిమిది సెగ్మెంట్లలోను పోలింగ్ జరుగుతుంది. కాశ్మీర్ లోయలోని సీట్లు పాంపోర్, త్రాల్, పుల్వామా, రాజ్‌పోరా, జైనపోరా, షోపియన్, డిహెచ్ పోరా, కుల్గామ్, దేవ్‌సర్, దూరు, కొకెర్‌నాగ్ (ఎస్‌టి), అనంతనాగ్ పశ్చిమం, అనంతనాగ్, శ్రిగుఫ్వారా బిజ్‌బెహరా, షాంగుస్ అనంతనాగ్ తూర్పు, పహల్గామ్. జమ్మూ



ప్రాంతంలోని సీట్లు ఇందర్‌వాల్, కిష్ట్‌వార్, పాద్దర్ నాగ్సేని, భదర్వాహ్, దోడా, దోడా పశ్చిమం, రాంబన్, బనిహాల్.

## దేశ భవిష్యత్తు కోసం ఐక్యంగా ఉన్నాం: హారిస్

చికాగో: దేశ భవిష్యత్తు కోసం భాగస్వామ్య దృష్టితో అమెరికన్లు అంతా ఐక్యంగా ఉన్నారని అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఇక్కడ డెమొక్రటిక్ నేషనల్ కన్వెన్షన్ ప్రారంభం రోజున భావోద్వేగంతో వెల్లడించారు. ఈ రాత్రి అందరి లోనూ మనదేశం అందాన్ని చూస్తున్నానని, దేశం లోని ప్రతి మూల నుంచి, జీవితం లోని ప్రతిరంగం నుంచి ప్రజలు దేశ భవిష్యత్తు కోసం భాగస్వామ్య దృష్టితో ఏకమయ్యారని 59 ఏళ్ల హారిస్ వేలాది మంది డెమొక్రటిక్ పార్టీ సభ్యుల హర్షధ్వానాల మధ్య అన్నారు. ఈ నవంబర్‌లో మనం ఒకే తాటిపైకి వచ్చి ఒకే స్వరం, ఒకే వ్యక్తిగా ప్రకటిస్తాం.దేశం పట్ల మనకున్న ప్రేమ ద్వారా, మార్గనిర్దేశం చేస్తూ ఆశావాదం, విశ్వాసంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. డెమొక్రటిక్ పార్టీ తరఫున అధ్యక్షఅభ్యర్థిగా తన అంగీకార ప్రసంగాన్ని హారిస్ గురువారం వెల్లడించాల్సి ఉంది. మాజీ అధ్యక్షుడు ట్రంప్ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ఆమెకు ప్రత్యర్థి. ఈ సందర్భంగా మన వైదొలగనున్న అధ్యక్షుడు జో బిడెన్ ను అభినందించుకుందాం అని పేర్కొంటూ.. "మీ చారిత్రక నాయకత్వానికి, దేశానికి జీవితకాలం చేసిన సేవలకు ధన్యవాదాలు అని బిడెన్‌ను ప్రశంసించారు. జాతి వర్ణపు మొదటి మహిళగా హారిస్



అమెరికా లోని ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థి అయ్యారు. అధ్యక్ష టికెట్‌పై అగ్రస్థానంలో ఉన్న మొట్టమొదటి భారతీయ అమెరికన్ కూడా అయ్యారు. త్వరలో మాజీ అధ్యక్షుడు ఒబామా నుంచి ఆమోదాన్ని పొందుతారు. అమెరికాను ముందుకు నడిపించే వ్యక్తిత్వం, అనుభవం, భవిష్యత్ దృక్పథం హారిస్‌కు ఉన్నాయని మాజీ విదేశాంగ కార్యదర్శి, ప్రథమ మహిళ హిల్లరీ క్లింటన్ ప్రశంసించారు.

## సంపాదకీయం

బుధవారం, ఆగస్టు 21, 2024

# ఒలింపిక్స్‌లో మనమెక్కడ.....!

జూలై 26న పారిస్‌లో ప్రారంభమైన విశ్వక్రీడలు పదిహేడు రోజుల పాటు నిర్వహించి 32 క్రీడలు 48 విభాగాలలో 329ఈవెంట్స్‌ను నిర్వహించారు. దీంతో మూడుసార్లు ఒలింపిక్స్‌ను నిర్వహించిన ఏకైక నగరంగా పారిస్ వినుతికెక్కింది.మొత్తం ఈ ఒలింపిక్స్‌లో 329 స్వర్ణ పతకాలతో పాటు 1044 మెడల్స్ ప్రధానం చేయడం జరిగింది. పతకాల వేటలో ఎప్పటిలానే చైనా, అమెరికాలు హోరాహోరిగా తలపడ్డాయి. అమెరికా 40 స్వర్ణాలతో మొత్తం 126 పతకాలు గెలుచుకుని అగ్రస్థానంలో ఉంటే, చైనా 40 స్వర్ణాలతో 91 ఇతర పతకాలను గెలుచుకొని రెండో స్థానంలో నిలిచింది. మనదేశం 6 పతకాలు సాధించి 71వ స్థానంలో ఉంది. ఆధునిక ఒలింపిక్స్ 1896సం.లో ప్రారంభమైతే, 1900లో జరిగిన రెండో ఒలింపిక్స్‌లో ఇండియా అరంగేట్రం చేసింది. ప్రారంభ ఒలింపిక్స్‌లోనే అదరగొడుతూ భారత్ రెండు పతాకాలను గెలుచుకుంది. అయితే 128 ఏళ్ల చరిత్ర కలిగిన ఒలింపిక్స్‌లో మనం ఇప్పటి వరకు సాధించిన పతకాల సంఖ్య కేవలం 41. అందులో స్వర్ణాలను వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. దేశం సాధించిన పది స్వర్ణాలలో ఎనిమిది హాకీ జట్టే సాధించినవి కావడం కొసమెరుపు. పతకాల మొత్తంలోనూ హాకీదే అగ్రస్థానం. పారిస్ ఒలింపిక్స్‌కు అమెరికా నుంచి అత్యధికంగా 558 ప్లేయర్స్ పాల్గొన్నారు. నాలుగున్నర కోట్ల జనాభా ఉన్న స్పెయిన్ నుంచి 383 మంది, కోటి జనాభా ఉన్న బెలారస్ 45మంది ఒలింపిక్స్‌కు వెళితే, 145 కోట్ల జనాభా ఉన్న ఇండియా నుంచి 117మంది మాత్రమే ఒలింపిక్స్‌కు క్వాలిఫై కావడం జరిగింది. పైగా పారిస్ ఒలింపిక్స్‌లో నిర్వహించిన మొత్తం క్రీడలు 32 కానీ అందులో మన క్రీడాకారులు పాల్గొన్నది కేవలం 12 క్రీడలలోని, 16 విభాగాలలో 62ఈవెంట్స్‌ను మాత్రమే ఆడటం జరిగింది. ఇప్పటివరకు మనదేశం ఒలింపిక్స్‌లో ఆడిన వాటికంటే ఆడ టానికి క్వాలిఫై కాకుండా వెనుదిరిగిన వాటి సంఖ్యే అధికం. చాలా ఆటల్లో ఏళ్లకు ఏళ్లు గడిచినా అర్హతకు నోచుకోక పోవడం దురదృష్టకరం. ఈసారి ఒలింపిక్స్‌లో గెలిచిన ఆరింటిలో ఒకటి రజతం, ఐదు కాంస్య పతకాలు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ తరుపున ప్రథమంగా 10.మీ.ల ఎయిర్ పిస్టల్ షూటింగ్ విభాగంలో మనుభాకర్ కాంస్యం సాధించడంతో బోణీ మొదలైంది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారతీయురాలుగా మను భాకర్ గుర్తింపు పొందారు. మిక్సడ్ టీమ్ 10మీ.ల ఎయిర్ పిస్టల్ షూటింగ్‌లో మనుభాకర్, సరబ్ జ్యోత్ సింగ్‌లు కలిసి కంచు పతకంను గెలుచుకున్నారు. స్వప్నిల్ కుసలే కూడా పురుషుల 50మీ.ల షూటింగ్‌లో మరో కంచు పతకం చేజిక్కించుకున్నారు. ఈ ఎడిషన్‌లో మూడు పతకాలు షూటింగ్‌లోనే గెలుచుకోవడం విశేషం. మిగతా మూడింటిలో ఒక కాంస్య పతాకాన్ని పురుషుల హాకీ జట్టు గెలిచింది. దీనితో 52 సంవత్సరాల తరువాత వరుసగా రెండోసారి హాకీ జట్టు ఒలింపిక్స్‌లో గెలిచినట్లు అయింది. ఈ ఒలింపిక్స్‌లో ఎన్నో ఆశలతో అడుగుపెట్టిన నీరజ్ చోప్రా జావెలిన్ త్రోలో రజతంతోనే వెనుదిరిగారు. ఒలింపిక్స్ పురుషుల విభాగంలో భారత్ తరుపున పాల్గొన్న ఏకైక రెజ్లర్ అమన్ సెహ్రావత్ కాంస్యం దక్కించుకున్నారు. అమన్ ఒలింపిక్ చరిత్రలోనే అతి పిన్న వయసులో పతకం గెలుచుకున్న భారత్ అథ్లెట్‌గా రికార్డు నమోదు చేశారు. మహిళా రెజ్లింగ్‌లో అనూహ్యంగా గెలుపు ముందు నిలిచిన వినేష్ ఫొగట్ స్వర్ణానికి ముందు నిర్ధారించిన బరువు కంటే 100గ్రా.లు అధికంగా ఉందని డిస్ క్వాలిఫై కావడం భారతీయులందరిని నిరాశ పరిచింది.అత్యధిక జనాభా కలిగిన మనదేశం నుండి ఒలింపిక్స్‌లో ఆడేవారు అంతంత మాత్రమే. దీనికి అనేక కారణాలు.. సహజంగా ప్రతి పిల్లవాడు ఆటల పట్ల ఆసక్తిని కనబరుస్తాడు. కానీ క్రీడల పట్ల తల్లిదండ్రులలో అవగాహన లేకపోవడంతో వారి ఆశలను మొగ్గలోనే తుంచివేస్తున్నారు. అసలు దేశంలో సమగ్ర క్రీడా వ్యవస్థ లేదు. అందువలన తల్లిదండ్రులు పిల్లలు స్పోర్ట్స్‌ను కెరీర్‌గా ఎంచుకోవడానికి, వాటిలో ఆడించడానికి వెనకడుగు వేస్తున్నారు. క్రీడల నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లలో అరకొర నిధులు కేటాయించడం కూడా ఓ కారణం. అయితే ప్రభుత్వం సమగ్ర క్రీడా విధానం రూపొందించుకుని పాఠశాల స్థాయిలోనే పిల్లల క్రీడానైపుణ్యాలను గుర్తించేలా, పెంపొందించేలా చర్యలు చేపట్టాలి. ఆసక్తి కనబరిచే వారికి శిక్షణనిచ్చి తీర్చిదిద్దాలి. వారి సంపూర్ణ క్రీడా బాధ్యతలను ప్రభుత్వమే చూసుకోవాలి. అలాగే క్రీడాకారులకు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మరింతగా కల్పించాలి. అప్పుడే పిల్లలు, యువత క్రీడల పట్ల ఆసక్తి కనబరుస్తారు. క్రీడల గురించి ప్రభుత్వం విస్తృత ప్రచారం చేసి అవగాహనను కల్పించాలి. పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేస్తే వచ్చే నాలుగేళ్లకు జరిగే లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ లోనైనా మనం రెండంకెల పతకాలు గెలుచుకోవడానికి అవకాశం ఉంటుంది.

# పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి సమావేశం

## - రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దాసరి దేవేందర్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ఇల్లంతకుంట:** పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ఈనెల 25న వేములవాడ పట్టణంలోని ఎస్ ఆర్ ఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో టియు డబ్ల్యూజె ఐజెయు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని సీనియర్ పాత్రికేయులు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దాసరి దేవేందర్ మరియు జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే ఐజేయు మండల అధ్యక్షుడు మారుపాక అనిల్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యలు, మరియు ఐక్యతను చాటుకునేందుకు టీయుడబ్ల్యూజే ఐజేయు ఆధ్వర్యంలో వేములవాడలో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇట్టి సమావేశానికి పెద్ద ఎత్తున యూనియన్ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు తుంకుంట శ్రీనివాసరెడ్డి, కొయ్యడ రాజయ్య, పెద్దూరి శ్రీనివాస్, సాదుల నిరంజన్, కమటం పరుశురాం ,బండారి శ్రీనివాస్, గుండా రవీందర్, జక్కుల శ్రీనివాస్ ,తదితరులు పాల్గొన్నారు.



## వర్గీకరణను వ్యతిరేకిస్తూ తలపెట్టిన భారత్ బంద్

# విజయవంతం చేయాలి



**తెలంగాణా క్యాపిటల్ న్యూస్ ఇల్లంతకుంట:** ఎస్సీ,ఎస్టీలను వర్గీకరిస్తూ సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఈనెల 21న జరిగే భారత్ బంద్ ను విజయవంతం చేయాలని ఇల్లంతకుంట మాల మహానాడు యువజన సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీలు తమ స్వార్ధ ప్రయోజనాల కొరకు వర్గీకరణ పేరుతో ఎస్సి,ఎస్టీలను విభజించి పాలించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఎస్సి,ఎస్టీలు ఉద్యమించకపోతే భవిష్యత్తు తరాలకు నష్టం జరుగుతుందని అన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో ఎస్సి,ఎస్టీలకు కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని తెలిపారు.సుప్రీం కోర్టు తీర్పుతో ఎస్సి,ఎస్టీ విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్రంగా ప్రభావం చూపుతుందని,కాబట్టి ఎస్సీ ఎస్టీ విద్యార్థులు,ఉద్యోగ సంఘాల నేతలు,దేశంలో వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న ఎస్సీ,ఎస్టీ నేతలు భారత్ బంద్ లో పాల్గొనాలని కోరారు.21న జరిగే భారత్ బంద్ ను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు యువజన సంఘం సభ్యులు చాతర్ల రాజు,చాతర్ల బాబు,న్యాత అనిల్,మామిడి మహేందర్,మామిడి పర్శరాం, ఎలుక రాము,మామిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రుణ మాఫీ కానీ రైతుల పక్షాన బిజెపి నిరసన

## - రైతులతో చెలగాటం ఆడుతున్న రాష్ట్ర ప్రభుత్వం




**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం:** రుణ మాఫీ కానీ రైతుల పక్షాన మండల కేంద్రంలో మంగళవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మార్వో కు వినతి పత్రం ఇవ్వడం సమర్పించారు. ముఖ్య అతిథిగా బీజేపీ మానకొండూర్ అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల వరకు రుణ మాఫీ ఏక కాలంలో చేస్తామని గద్దెనెక్కి కేవలం 17993/- వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి మిగతా రైతులను నానా ఇబ్బందులు పెడుతున్న ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులను అయోమయానికి గురించేయకుండా స్పష్టమైన మార్గదర్శకాలతో తక్షణమే రుణ మాఫీ చేయాలని భారతీయ జనతా పార్టీ తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం లేని పక్షంలో ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి రైతుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఓ బి సి మోర్చా ఈ సి మెంబర్ మచ్చ బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి పర్శరామ్ గౌడ్, వీరగోని వెంకటేష్. ఉపాధ్యక్షులు మునిగంటి సత్తయ్య, బండి తిరుపతి.బుర్ర శ్రీనివాస్. పుల్లెల రాము,దళిత మోర్చా అధ్యక్షులు బామండ్ల రాజు. గంగాధర తిరుపతి ,మడికంటి స్వామి. మర్దనాపేట నరేష్. సాకేత్. మచ్చ మురళి కుర్ర హరీష్ రామిడి కృష్ణమూర్తి,గోవర్ధన్ రెడ్డి.మఠం రాజు. శేఖర్, లచ్చయ్య, శివ, అజయ్ తదితరులు మరియు రైతులు పాల్గొన్నారు.

## స్వీపర్ లైంగిక వేధింపులు..

# బద్లాపూర్ భగ్గు

**ముంబై ఆగస్టు, 20:** ఒక పాఠశాల వాష్‌రూమ్‌లో స్వీపర్ నాలుగు సంవత్సరాల బాలికలు ఇద్దరిపై లైంగిక అత్యాచారం ఆరోపణ నేపథ్యంలో వేలాది మంది నిరసనకారులు మంగళవారం ఠాణె జిల్లా బద్లాపూర్ రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలను ఆక్రమించుకున్నారు. నిరసనకారులు స్థానిక పాఠశాల భవనాన్ని ముట్టడించారు. రైలు పట్టాలను ఆక్రమించుకుని పోలీస్ సిబ్బందిపై రాళ్లు రువ్విన నిరసనకారులపై పోలీసులు కేన్‌చార్జి చేశారు. ఆగ్రహోదగ్రులైన తల్లిదండ్రులతో సహా వందలాది మంది నిరసనకారులు లైంగిక అత్యాచారంపై తమ అసంతుష్టి వ్యక్తం చేయడానికి పాఠశాల భవనంలో విధ్వంసం సృష్టించారు.

కాగా, సీనియర్ ఐపిఎస్ అధికారి ఆర్తీ సింగ్ నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటుకు తాను ఆదేశించినట్లు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హోమ్ శాఖ మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వెల్లడించారు. పాఠశాలపై చర్య తీసుకోగలమని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రకటించారు. ఈ కేసుపై ఫాస్ట్ ట్రాక్ దర్యాప్తు జరిపిస్తామని, దోషులను వదలబోమని షిండే తెలియజేశారు. బద్లాపూర్ స్టేషన్‌లో ఆగ్రహోదగ్రులైన నిరసనకారులు పోలీస్ అధికారులకు వ్యతిరేకంగా 'హై, హై' నినాదాలు చేయడం కనిపించింది.


లైంగిక అత్యాచారానికి పాల్పడినట్లు భావిస్తున్న స్వీపర్‌కు మరణ శిక్ష విధించాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలల్లో 'విశాఖ కమిటీలు' ఏర్పాటు చేయనున్నట్లు, తమ ఆవరణల్లో సిసిటివి కెమెరాలు పని చేయడం లేదని తేలితే ఆ పాఠశాలలపై చర్య తీసుకోనున్నట్లు మహారాష్ట్ర విద్యా శాఖ మంత్రి దీపక్ కేసర్కర్ తెలిపారు. విద్యార్థినులు, ముఖ్యంగా 9, 10 తరగతులు, జూనియర్ కాలేజీల్లోనివారి సమస్యల వ్యక్తీకరణకు ఆ బృందాలు ఒక వేదిక ఏర్పాటు చేస్తాయని ఆయన చెప్పారు. బద్లాపూర్ పాఠశాలకు ఒక నోటీస్ జారీ చేసినట్లు, పాఠశాల ప్రిన్సిపాల్‌ను, కొద్ది మంది టీచర్లను, ఇద్దరు అసిస్టెంట్లను సస్పెండ్ చేసినట్లు కేసర్కర్ వెల్లడించారు. బద్లాపూర్ రైల్వేస్టేషన్‌లో నిరసన రోజు అంతా సాగింది. రైళ్లు నడవడాన్ని అనుమతించాలన్న అధికారుల విజ్ఞప్తులను పలువురు మహిళలతో సహా జనం ఖాతరు చేయలేదు. మధ్యాహ్నం నిరసనకారులను శాంతింపచేసేందుకు రాష్ట్ర మంత్రి గిరీష్ మహాజన్ ప్రయత్నించారు. బాధితులకు న్యాయం, అరెస్టయిన నిందితునిక మరణ శిక్ష కోరుతూ వారు నినాదాలు చేశారు. కాగా, బద్లాపూర్ రైల్వే స్టేషన్‌ల నిరసన రాజకీయ ప్రేరేపితమైనదని ఠాణె జిల్లా ముర్బాద్ అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి ఎంఎల్ఎ కిసన్ కాథోరె ఆరోపించారు. ఆందోళనకారులు పొరుగు ప్రాంతాలవారని, బద్లాపూర్ వాసితులు కారని కూడా ఆయన ఆరోపించారు. బాధిత బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోవడానికి ముందు వారిని బద్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో 11 గంటల పాటు వేచి ఉండేలా చేశారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. కోల్‌కతాలో యువ వైద్యురాలిపై అత్యాచారం-హత్య, వైద్య సమాజంలో తీవ్ర సంచలనం సృష్టించిన నేపథ్యంలో, థానే నిరసన పరిసర ప్రాంతాల నుండి ప్రజలను ఆకర్షించింది.

# పెళ్లి పీటలెక్కనున్న... ప్రేమ జంట



తన తొలి సినిమా హీరోయిన్‌ను ప్రేమించాడు కిరణ్ అబ్బవరం. ఆమెతో డేటింగ్ చేశాడు. తాజాగా నిశ్చితార్థం కూడా పూర్తిచేశాడు. ఆమె పేరు రహస్య. ఇప్పుడు వీరి పెళ్లి జరగనుంది. రహస్యని పెళ్లి చేసుకుంటున్నాడు కానీ పెళ్లి రహస్యం కాదు. అలాగనీ అందరినీ పెళ్ళికి పిలవడం లేదు. డెస్టినేషన్ వెడ్డింగ్ అన్నమాట. గురువారం రహస్య మెడలో మూడు ముళ్లు వేయబోతున్నాడు కిరణ్ అబ్బవరం. కర్నాటకలోని కూర్గ్‌లో పెళ్లి చేసుకోబోతున్నారు కిరణ్, రహస్య. పెళ్లికూతురు రహస్య బంధువులంతా ఎక్కువగా అక్కడే ఉన్నారట. కిరణ్ సరసన రాజా వారు రాణి గారు చిత్రంలో నటించింది రహస్య. ఆకాశమంత ప్రేమ, షర్బత్ వంటి చిత్రాలు కూడా చేసింది. ప్రస్తుతం ఆమె సినిమాలకు దూరంగా ఉంది. కిరణ్ అబ్బవరం సినిమాల వ్యవహారాల్ని మాత్రం చూసుకుంటోంది. ప్రస్తుతం ఈ హీరో 'క' అనే సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా టీజర్‌కు మంచి స్పందన వచ్చింది.

# దీపావళి కానుకగా 'లక్కీ భాస్కర్'



వివిధ భాషలలో సినిమాలు చేస్తూ, దేశవ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్. తెలుగులోనూ మహానటి, సీతారామం వంటి ఘన విజయాలను సొంతం చేసుకున్న ఆయన. ఇప్పుడు 'లక్కీ భాస్కర్' అనే మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడానికి సిద్ధమవుతున్నారు. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. దుల్కర్ సల్మాన్ అభిమానులు మాత్రమే కాకుండా సినీ ప్రేమికులు సైతం 'లక్కీ భాస్కర్' విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దానికి తోడు ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'శ్రీమతి గారు' గీతం, టైటిల్ ట్రాక్ తో పాటు, టీజర్ విశేషంగా ఆకట్టుకోవడంతో ప్రేక్షకులలో సినిమా మీద అంచనాలు మరింత పెరిగాయి. ఇక ఈ చిత్రాన్ని మొదట సెప్టెంబర్ 7వ తేదీన విడుదల చేయాలని నిర్మాతలు భావించారు. అయితే ఇప్పుడు దీపావళి పండుగ కానుకగా విడుదల చేయాలని నిర్ణయించారు. దీపావళి సందర్భంగా ఈ చిత్రం అక్టోబర్ 31న థియేటర్లలోకి వస్తుందని నిర్మాతలు ప్రకటించారు. 'లక్కీ భాస్కర్' కోసం ఇంతలా ఎదురు చూస్తున్న అభిమానులకు, ప్రేక్షకులకు ధన్యవాదాలు చెబుతూనే.. నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి చేయడానికి అదనపు సమయం పడుతుందని, అందుకే విడుదల తేదీ మారిందని నిర్మాణ సంస్థ వివరించింది. వెండితెరపై ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించడం కోసం, డబ్బింగ్ సహా అన్ని సాంకేతిక విభాగాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పని చేస్తున్నట్లు తెలిపింది. పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్న ఈ చిత్రాన్ని ప్రతి భాషలో మాతృ భాష అనుభూతిని అందించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. చిత్ర విడుదలను వాయిదా వేయడం కష్టమైనప్పటికీ, ఈ నిర్ణయం సినిమాకు మేలు చేస్తుందని నిర్మాతలు భావిస్తున్నారు. 'లక్కీ భాస్కర్' చిత్రానికి అత్యుత్తమ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ప్రముఖ కళా దర్శకుడు బంగ్లాన్ ఈ చిత్రం కోసం 80ల నాటి ముంబయ్‌ని పునర్నిర్మించారు. ఈ చిత్రంలో ఆయన అద్భుత పనికి అవార్డులు అందుతాయని నిర్మాతలు నమ్మకంగా ఉన్నారు. ఛాయాగ్రాహకుడు నిమిష్ రవి కెమెరా పనితనం దర్శకుని ఊహకు ప్రాణం పోసింది. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఈ చిత్రానికి ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత జివి ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఒక సాధారణ వ్యక్తి అసాధారణ కథగా తెరకెక్కిన ఈ 'లక్కీ భాస్కర్' చిత్రం అక్టోబర్ 31వ తేదీన తెలుగు, మలయాళం, తమిళ, హిందీ భాషలలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# పవన్ కల్యాణ్ సరసన అవకాశం రావడం నా అదృష్టం: ప్రియాంక



ప్రముఖ నటుడు పవన్ కల్యాణ్ తో కలిసి నటించే అవకాశం రావడం తన అదృష్టమని హీరోయిన్ ప్రియాంక అరుల్ మోహన్ అన్నారు. సుజీత్ దర్శకత్వంలో వస్తున్న ఓజీ సినిమాలో పవన్ కల్యాణ్ సరసన అరుల్ మోహన్ కనిపించనున్నారు. తాజాగా సరిపోదా శనివారం ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రియాంక మాట్లాడింది. నాని, పవన్ కల్యాణ్ ఇద్దరూ క్రియేటివ్ గా ఉంటారని,పవన్ కల్యాణ్ ప్రజల గురించి ఆలోచిస్తే,నాని సినిమాల గురించి కలలు కంటాడన్నది.



# ప్రభాస్ మూవీలో ఇమాన్వినే ఎందుకు?: కారణం చెప్పిన హను రాఘవపూడి



ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా వినిపిస్తున్న సినిమాల్లో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, ప్రముఖ దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కిస్తున్న సినిమా కూడా ఒకటి. ఈ చిత్రంలో కొత్త నటి ఇమాన్వి... ప్రభాస్ సరసన నటిస్తున్నట్టుగా మేకర్స్ తెలియజేశారు. అయితే ఈ కొత్త హీరోయిన్‌ను ఎలా తీసుకున్నారో హను రాఘవపూడి తెలిపారు. తాను సోషల్ మీడియా ద్వారానే ఇమాన్విని చూశానని, ఆమె డాన్స్ వీడియోస్ చూశానని పేర్కొన్నారు. అలా సోషల్ మీడియా ద్వారానే ఆమెని సంప్రదించామని, సినిమా కోసం ఆడిషన్ చేయడానికి పిలిచామని... అలాగే మొత్తం 15 రోజుల పాటు ఆడిషన్ స్క్రీన్ టెస్ట్ చేశామన్నారు. ఈ స్క్రీన్ టెస్ట్‌ని ప్రభాస్‌కి కూడా చూపించగా తనకి కూడా ఇమాన్వి ఈ చిత్రానికి పర్ఫెక్ట్ అని అనిపించడం తోనే ఆమె ఈ భారీ ప్రాజెక్ట్‌లోకి ప్రవేశించిందని హను వివరించారు. ఇలా ఈ యంగ్ నటి టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది.